# అదృష్టమంటే

'ప్రమద'

కృష్ణమూర్తి మా లాడ్జి ఎదురుగఉన్న ఇంటివారమ్మాయిని ప్రేమించాడన్న సంగతి లాడ్జి అంతా గుప్పుమంది. మూర్తి అంటే సామాన్యుడా? బి. ఎస్. సి రెండవ సంవత్సరము చదువుతున్న ధీరుడు. మిత్రులందరము పరామర్శించటానికి మూర్తి రూముకు వెళ్ళాము. మాసిన చొక్కా, మాసిన లుంగీ, మాసిన గడ్డము, గుర్తుపట్టలేనంతగ మారిపోయాడు.

"చెప్పురాన్నా! చెప్పు అసలు ఎలా చూశావు ఆ అమ్మాయిని!" రాజు సిగిరెట్టుపొగ పీలుస్తూ అడిగాడు.

ఇది పూర్తి కాకుండానె బైరాగి మరో ప్రశ్న వేశాడు.

"అసలు ఆ అమ్మాయి పేరేమిటి?"

మూర్తి మాట్లాడలేదు అర్థనిమీలితనేత్రుడై అలాగే కూర్చున్నాడు.

"పోని ఎప్పటినించి నీకీ విరహ జ్వరము ప్రారంభించిందో చెప్పేవుకాదు" అని రాజు సిగిరెట్టు అవతల పారేశాడు.

మూర్తి అప్పటికీ మాట్లాడలేదు.

"నువ్వు చెప్పకపోతే నేను కనుక్కోలేనా!" అన్నాడు డిటెక్టివ్ అని చెప్పుకుంటున్న జగం.

మేమంతా జగ్గువైపు చూశాము. పడకుర్చీలోంచి లేచాడు. సిగిరెట్టు ముట్టించాడు. గబగబ మూర్తి పుస్తకాలవైపు చూశాడు. కానేపు అక్కడేదో చూశాడు. వెంటనే ఓ గెంతు గెంతాడు.

"ఆ! ఆ అమ్మాయిపేరు రాధ. అవునా?" అన్నాడు మూర్తివైపుచూసి.

మూర్తి అవునన్నట్టు తల ఊపాడు.

"ఇకనైనా నేను పెద్ద డిటెక్టివ్ అని ఒప్పుకుంటారా?" అన్నాడు.

మా అందరికి ఆశ్చర్యమేసింది. ఎందుకంటే-వకీలు కామేశంగారు వచ్చి ఇంకా వారం రోజులుకాలేదు. ఆ అమ్మాయిని వీడు ఎలాచూసి ప్రేమించేశాడో తెలియలేదు.

"అదీ నేను కనుక్కుంటాను" అన్నాడు జగ్గు.

"ఏది?" బైరాగి రోగిలాగ ప్రశ్నించాడు.

"అదే! ఎలా ప్రేమించాడో?"

"సరే. కనుక్కో." మేమంతా వెళ్ళిపోయాము. తరువాత మర్నాడు ఆదివారము. మాకు శెలవ. మధ్యాహ్నపువూట కూర్చుని సీక్వెన్స్ ఆడుతున్నాము. జగం అమాంతం మా మధ్యలోకి దూకాడు. "కనుక్కున్నానురా" అన్నాడు.

"ఎలాగో చెప్పు?" ఆట ఆగిపోయింది.

జగ్గు సిగిరెట్టు ముట్టించాడు.

"వినండి! నాలుగు రోజుల క్రిందట మనవాడు స్నానంచేసి బాత్‌రూమునుంచి వస్తున్నాట్ట. వాడి కళ్ళకు ఆ అమ్మాయి కనపడ్డది. ఇంకేముంది కిందబడ్డంత పనిఅయి (పడే ఉంటాడు) ఆ అమ్మాయి స్వరూపాన్ని తన మనస్సులో గాఢంగ హత్తుకుపోయేటట్టు చిత్రీకరించాట్ట. ఇక చూసుకో, వాడికి ప్రారంభమయింది విరహ జ్వరము." జగ్గు పూర్తి చేశాడు.

"అసలు వాడికి మార్కులేమి వస్తయి? మనకు నెక్స్టువీక్ పరీక్షలు." రాజు తెలివి వెలగబెట్టాడు.

"ఉండ్రా! నీ దోక గొడవ." పరీక్షలంటే భయపడే బైరాగి కసురుకున్నాడు.

"ఒరే, మనమంతా ఓ పనిచేస్తే" జగం సీరియస్‌గ మాట్లాడేడు.

'ఏమి'టన్నట్లుగ వాడివైపు తలలు తిరిగాయి.

"ఏంలేదు; వాడిని పరీక్షలందాకా చదవమందాము. తరువాత ఆలోచించవచ్చు!" జగం అయిడియా అందరకు నచ్చింది.

ఆ మాట మూర్తికి చెప్పేము. ఏమనుకున్నాడో ఆరోజునుంచి సీరియస్‌గా చదివాడు. అసలు మూర్తికి ఎప్పుడు మంచి మార్కులు వస్తుండేవి. సాధారణంగ ఫస్టుక్లాసులోనే పేసవుతుండేవాడు.

పదిహేను రోజులు గడిచిపోయినయి అతికష్టము మీద. ఆ రోజు రాత్రి ఫస్టుషో సినిమాకెళ్ళి పదింటికి లాడ్జికొచ్చి మూర్తిని కలుసుకున్నాము. రూము కిటికీదగ్గర కుర్చీ వేసుకుని, చెంపకు చెయ్యి ఆనిచ్చి పెట్టుకుని 'జాగ్ తెరహో'లోని రాజకపూర్ ఫీలింగు ఇచ్చి కూర్చున్నాడు మూర్తి.

"ఓ కృష్ణ, ఏ రాధ దగ్గర ఉన్నావు? ఇటు చూడు." అన్న సుబ్బారావు మాటవిని ఉలిక్కిపడ్డాడు.

మమ్మల్ని చూడగానె బావురుమని ఏడ్చాడు. రాజు వాడిని కావలించుకుని ఓదార్చి తన స్నేహితాన్ని హావభావ చేష్టలతో నేర్పుగ కనపరిచాడు.

"ఆహా! స్నేహమంటె ఇది!" బైరాగి ఆశ్చర్యపడిపోయాడు.

"ఒరే! చూడరా! నిన్న సాయంత్రము రాధ గాంధిపార్కుకు వచ్చింది. దగ్గరకెళ్ళి..." మూర్తి ఆగాడు.

"ఆ! చెప్పు" రాజుగాడు మంచి ఛాన్సు పోయిందే అన్నట్లు విచారంగ చూస్తున్నాడు.

"మీరు చెప్పినట్లే ప్రేమిస్తున్నానని చెప్పాను." అన్నాడు మూర్తి దీనంగా.

"ఊ! తరవాత ఏముంది?" సుబ్బారావుప్రశ్న.

"ఏముంది, ఎడమచేత్తో చెంపపగిలేట్టు ఒకటి కొట్టింది. ఇక ఈ పిచ్చివేషాలు మాని మీ చదువేదో మీరు చూసుకోండి. నా జోలికిరావద్దు. ఇంకానయం లెంపకాయతో పోనిచ్చాను. మానాన్నగారికిచెప్తాను ఇకమీదట ఇట్లాంటి వెధవపనులు చేస్తే —;" అంది అన్నాడు చెంపతడుముకుంటూ.

"ఓరి! దీనికే ఇంత ఇదయితే ఎలారా?" రాజుగాడు మళ్ళీసిగిరెట్టు వెలిగించాడు.

"నాకు మూడు విమల, లలిత, వసంత, కామేశ్వరి, సుగుణ, వీళ్ళంతా లెంపకాయలేగాదు, మొట్టికాయలు, వాళ్ళనాన్నల్ని, అన్నల్ని పిలిచారురాబాబు.చచ్చాను! ఇకప్రేమ సంగతి దేవుడెరుగును - బ్రతుకుతే ప్రేమించటం మాత్రం ఇకమీదట చస్తే చెయ్యను అనుకున్నాను. మరినీకు అనుభవంరావద్దూ! ఇదికొత్తేగా," అన్నాడు సుబ్బారావు సిగిరెట్టుపొగ వదులుతూ.

"ఒరె మూర్తీ! ఈ ప్రేమ గొడవమానేసి చదువుకో బాగుపడతావు." చివరి సలహా ఇచ్చాడు రాజు.

"లాభంలేదురా, ఎలాగయినా......"మూర్తి నిశ్చయానికొచ్చాడు.

"అంటే నువ్వు భగ్నప్రేమికుడివంటావు?" బైరాగి రాజువంక చూశాడు.

"అంతేగదురా!" రాజు పూర్తి చేశాడు.

"ఇప్పుడేం చెయ్యాలి?" బైరాగిప్రశ్న.

దేవదాసులో నాగేశ్వరరావు ఫీలింగు ఇచ్చి, "రాధ, రాధ ... నిన్ను చూడకుండ ఉండలేను ... నీవే నా సర్వస్వము ... నీవేనా..." సుబ్బారావు కవిత్వము ప్రారంభించాడు.

"నువ్వు నోరు మూస్తావా నాలుగుతన్నాలా?" రాజు గదమాయించాడు.

"ప్రభువుల చిత్తము" సుబ్బారావు నోరు రాజు నొక్కేశాడు.

"దీనికి మనమేమిచెయ్యాలేము" బైరాగి నిర్ణయానికొచ్చేశాడు.

"ఇప్పుడేలా?" రాజు ఆలోచనలో పడ్డాడు. బైరాగి మెదడుకు పనిచెప్పేడు.

సుబ్బారావు తలబాదుకున్నాడు.

జగం డిటెక్టివ్‌లా ప్రశ్నిస్తున్నాడు మూర్తిని.

చివరికి ఒకనిశ్చయానికి వచ్చేరు.

"ఏం లాభంలేదురా; పైగా ఆయన (రాధతండ్రి) ఎలాంటి వాడో తెలియదు? అందుకని రాధ చెప్పినట్టు మాట్లాడక చదువుకో."

మూర్తిమాట్లాడలేదు.

మేమందరము ఎవరి ఊళ్ళకు వాళ్ళు వెళ్ళాము.

ఒక పదిరోజులు గడిచినయి. ఆ రోజు ఊరంత తిరిగివచ్చిన నాకు ఒక శుభలేఖఇచ్చారు. ఆశ్చర్యపోయాను. "ఎల్లుండి, నాకు రాధకు పెళ్లి. తప్పక రావలసింది.

మిత్రుడు

"కృష్ణ"

అని లెటరుకూడ వ్రాశాడు. ఇదేమిటా అనుకుని ఇంట్లో చెప్పి వాడి పెళ్ళికి బయలుదేరాను. నేవెళ్ళేటప్పటికి రాజు, బైరాగికూడ వచ్చేశారు.

"అసలు ఎలా ఒప్పుకుందిరా రాధ?"అని మేమంతా వాడ్ని ఊపిరాడకుండా అడిగాము.

"ఉండదర్రా చెపుతున్నాను. మొన్నవారం రోజులక్రిందట నాకు జ్వరమువచ్చింది. బాగవచ్చింది. నూటయిదుకూడ దాటి ఉంటుంది. నాకసలు ఒంటిమీద స్పృహలేదు రెండురోజులకు తగ్గింది కొంచెము. కళ్ళు తెరిచాను. కామేశ్వరరావుగారి ఇంట్లో పక్కమీద ఉన్నాను. పక్కనే రాధ నిలుచుని మందు కలిపి ఇస్తున్నది. ఇదేమిటా అనుకుని నలుపక్కలా దిక్కులుచూస్తున్నాను. రాధనవ్వుతూ, "ఏమండీ! నన్ను అంతగాఢంగ ప్రేమించారా? చచ్చిపోతారా? ఇక పొండిచూద్దాము. ఇంకేముందిలెండి భలేభయపడ్డాను మీకు తగ్గుతుందో లేదోనని. ఇంతెందుకు రేపు వారానికల్లా మీతోపాటు నేను వచ్చేస్తాను" అంది.

"అంటె" అన్నాను. నేను.

"అంటెనా?" అంటూ 'కొంటెగాచూసి, "ఇదిగో" అంది ఓ కార్డు నాచేతికిస్తూ. ఆకార్డు శుభలేఖ అన్నమాట; అని మూర్తి పూర్తిచేశాడు.

"పోనీలేరా. అవస్తపడ్డందుకు ఫలితంలభించింది" అన్నాము.

"మరి మీనాన్నగారు, అమ్మగారు ఒప్పుకోవద్దూ? అన్నాను తెలియక.

"ఆ! అసలు తమాషా వినండి నేచెప్పగానే ఒప్పుకున్నారు."అన్నాడు. పచ్చనితోరణాలమధ్య, చక్కటిరాధమెళ్ళో మా వాడు కృష్ణమూర్తి సమంత్రకంగా తాళికట్టేడు.

"అదృష్టమంటే ఇదే" రాజు చివరిమాట పూర్తిచేశాడు.

---

పాలవాడు:-ఇవ్వాళ పాలు శేరు రూపాయి తల్లీ!

ఆమె:-ఇదేమిట్రా! రోజూ శేరు పన్నెండు అణాలేగదూ!

పాలవాడు:-ఔనమ్మా! కాని ఇవ్వాళ కొళాయిలు వేగంగా కట్టేశారమ్మాఊరి!